

దౌల్తాబాద్‌లో గ్రంథాలయ ప్రారంభోత్సవంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, తదితరులు

చదవడం అలవాటు చేసుకోవాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

దౌల్తాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): నేటి యువత పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో రూ.88 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్, జిల్లా చైర్మన్ రాజేశ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామ పంచాయతీల్లో చిన్న, చిన్న గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డిప్యూటీ సెక్రటరీ సురేశ్‌బాబు, నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, శివాని, మహవీన్, పవన్, గణేశ్, తహసీల్దార్ గాయత్రి, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, ప్రమోద్‌రావు, రెడ్డి శ్రీనివాస్, వెంకట్రాములు, వీరన్న పాల్గొన్నారు.

చైల్డ్‌పోర్న్ చూసినా, అప్‌లోడ్ చేసినా చర్యలు

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



పరిగి,మే 23 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినా, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నారాయణ రెడ్డి హెచ్చరించారు. అలా చేసిన వ్యక్తులపై పరిగి సర్కిల్ పరిధిలోని పరిగి, చన్‌గోముల్ పీఎస్‌లలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి వ్యక్తులపై సైబర్ టీంల ద్వారా నిఘా ఉంచామని పేర్కొన్నారు. ప్రధానంగా చైల్డ్ పోర్నోగ్రఫీ చూడడం, లేదా గూగుల్‌లో వాటికోసం వెతకడం వంటి చర్యలను పోలీస్‌శాఖ తీవ్రంగా పరిగణిస్తుందని తెలిపారు. పోర్న్ సమాజంలో అసభ్యతను వ్యాప్తి చేస్తుందని, మహిళలు, పిల్లల గౌరవాన్ని దిగజారుస్తాయని చెప్పారు. ఇవన్నీ సైబర్ నేరాల కిందకు వస్తాయని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలంతా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత సోషల్ మీడియాను బాధ్యతగా ఉపయోగించాలని సూచించారు.

సబ్సిడీ రేషన్ బియ్యం పంపిణీపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే మూడు నెలల బియ్యం కోటాను ఒకే సారి పంపిణీ చేయాలని ఆదేశించింది. వర్షకాలం నిత్యావసర సరుకుల రవాణా విషయంలో అనేక ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే జూన్, జులై, అగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోటాను జూన్‌నెలలోనే పంపిణీ చేయాలని రాష్ట్రాలకు ఆదేశించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారయంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే దీని అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొంత డైలమాలో ఉన్నట్లు తెలిసింది.

- వర్షాకాలం రవాణా ఇబ్బందులు లేకుండా నిర్ణయం
- ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశం
- కేంద్ర ప్రభుత్వ ఆదేశంతో రాష్ట్రం డైలమా!
- సన్న బియ్యం పంపిణీపై మల్లగుల్లాలు





మూడు నెలల కోటా

ఒకేసారి!

రేషన్ బియ్యం పంపిణీపై కేంద్రం ఆదేశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): రాష్ట్రంలో పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం ప్రారంభించిన ఏప్రిల్ నెలలో క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. తరువాత ఈ నెలలో కూడా అక్కడక్కడ సమస్యలు వచ్చాయి. కొన్ని జిల్లాలకు సరిపడా నెలకోటా సకాలంలో పంపిణీ జరగలేదు. అన్ని ప్రాంతాలకు సన్నబియ్యం అందుబాటులో లేకపోవడంతో కొన్ని జిల్లాలకు ఆలస్యంగా సరుకు వెళ్లింది. మరోవైపు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం బాగున్నాయనే ప్రచారంతో రేషన్ దుకాణాల్లో బియ్యం కోసం జనం బారులు తీరారు. దీంతో ఈ నెలలో చౌకధరల దుకాణాల్లో రేషన్ బియ్యం అమ్మకాలు

మిగతా 7వ పేజీలో...

జూన్ ఫస్ట్‌కే రేషన్ సిద్ధం



ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెలలోనే మూడు నెలల రేషన్ కోటా పంపిణీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. రంగారెడ్డి జిల్లాలో ప్రతినెలా 5,78,500 మంది రేషన్ కార్డుదారులకు 13,500 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించి 40,500 మెట్రిక్ టన్నుల బియ్యం సిద్ధం చేస్తున్నాం. జూన్ మొదటి తేదీ నుంచే రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ బియ్యం పంపిణీకి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- గోపీకృష్ణ, జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం

కరోనా కలకలం



మేడ్చల్ ప్రతినిధి, మే 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి యజమానికి(వైద్యుడు)కి కరోనా పాజిటివ్ రావటం తీవ్ర కలకలం సృష్టించింది. జిల్లాకు చెందిన కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడు అనారోగ్యంతో కోవిడ్ పరీక్ష చేసుకోగా పాజిటివ్ వచ్చింది. దీంతో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. కరోనా మహమ్మారి నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో కొత్తగా వైద్యుడికి పాజిటివ్ రావటం జిల్లావాసులను ఆందోళనకు గురిచేసింది. బాధితుడిని, కుటుంబ సభ్యులను జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉంచినట్టు సమాచారం.

ఆందోళన వద్దు

జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి



జిల్లాలో నమోదైన కరోనా కేసుతో ఆందోళన చెందొద్దని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరీ ఓ ప్రకటనలో సూచించారు. కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని ఓ పల్మనాలజిస్టుకు కరోనా పాజిటివ్ రాగానే అతడు ఐదు రోజులపాటు ఐసోలేషన్ నిబంధనలు పాటించి ప్రస్తుతం కోలుకున్నాడని తెలిపారు. బాధితుడి సభ్యుల్లో ఎవరికీ కరోనా సోకలేదని, వారందరూ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని పేర్కొన్నారు. వైద్యపరంగా ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎవరికైనా కోవిడ్ లక్షణాలు కన్పిస్తే వైద్యాధికారులను సంప్రదించి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు.



గనుల్లో అక్రమ తవ్వకాలపై నజర్

7

ఓగీపూర్‌లో నాపరాతి గనులను పరిశీలించిన మైన్స్ అధికారులు



కీసరలో చివరిదశకు చేరుకున్న గ్రంథాలయ భవన నిర్మాణం

గ్రంథాలయానికి గ్రహణం

కీసరలో అసంపూర్తిగా భవన నిర్మాణం

- పనులు ప్రారంభించి మూడేళ్లయినా పూర్తికాని వైనం
- డిజైన్‌లో మార్పులతో పెరిగిన బడ్జెట్

కీసర, మే 23(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మూడేళ్లయింది. చివరి దశకు వచ్చిన పనులు నిలిచిపోవడంతో కీసర పట్టణ పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ బడ్జెట్‌కు సరిపడా పనులు చేసి చేతులు దులుపుకున్నాడు. దీంతో గ్రంథాలయ నిర్మాణంలో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో మేజర్ ప్రాంతమైన కీసరలో విరాళంగా వచ్చిన స్థలంలో గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి 2022లో శంకుస్థాపన చేశారు. అనుకున్న డిజైన్‌లో కాకుండా మార్పులు చేయడం వల్లే పనులు పూర్తికాలేదు. కోటి రూపాయాలతో పనులు చేయాలనుకున్నా డిజైన్‌లో

మిగతా 8వ పేజీలో...

జీపీఏ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



మేడ్చల్ ప్రతినిధి, మే 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న(ఆదివారం) జరుగనున్న గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని మహిళా డిగ్రీ కాలేజీలో ఈ నెల 25న గ్రామపాలన అధికారి పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆప్షన్ ఇచ్చిన 52 మంది వీఆర్‌ఓలు ఈ పరీక్షకు హాజరతున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని, దీనిని అభ్యర్థులు గమనించి, అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 733720990 లో సంప్రదించాలని కోరారు. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా గ్రామ పాలన అధికారి పోస్టులను ప్రభుత్వం తీసుకువచ్చింది. పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు వస్తాయోనని, సిలబస్ ఏమిటో తెలియక అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థుల తల్లితండ్రులు

కీసర రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నాటికి రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు కాంతి కీన్ ఫౌండేషన్ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం అఖిల భారత సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన కాంతి కీన్ పాఠశాల విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంతో కలిసి కిషన్‌రెడ్డిని కలిశారు. పాఠశాలలో మొత్తం 48 మంది విద్యార్థులు అర్హత సాధించారని, వరుణ్‌సాయి 291 మార్కులు, యశ్విత్‌సాయి, అకుల్‌బాబు 287, హిమాంశు విక్రమ్ 284, ఆయుష్‌తోష్ 281 మార్కులు సాధించారని తెలిపారు. వారిని మంత్రి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కోరుకొండ, కలిగిరిలోని సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు తెలంగాణ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికల్లా రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంతికీన్ ఫౌండేషన్ ప్రతినిధులు లావణ్య, కళ్యాణి, సంతోష్, మనోజ్, జాకబ్, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు

కలగొద్దు

బొంరాస్‌పేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్, మెట్లకుంట గ్రామాల్లో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల దగ్గరి నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరత ఉందని ఆయన దృష్టికి రాగా, లారీలను పంపించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనవెంట తహసీల్దార్ పద్మావతి, ఆర్ఐ శిరీష ఉన్నారు.



యువజన కాంగ్రెస్ నాయకులతో ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

బీజేపీ నియంతపాలనకు చరమగీతం పాడాలి

» ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కీసర, మే 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో నియంతపాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని రాంపల్లి దాయర లోని బాలవికాస కేంద్రంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆలోచనలు, కాంగ్రెస్ విధి, విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైట్ టీషర్ట్ కార్యక్రమం చాలా గొప్పదన్నారు. కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం, అందరికీ పురోగతి లాంటి ఐదు మార్గదర్శకాలకు వైట్ టీ-షర్ట్ ఉద్యమం చిహ్నంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ వెన్నెముక వంటిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు యువజన కాంగ్రెస్ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి సయ్యద్ ఖలీద్, జాతీయ కార్యదర్శి శ్రవణ్‌రావు, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను వేగంగా పరిశీలించాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికగుప్తా

మేడ్చల్ ప్రతినిధి, మే 23(ఆంధ్రజ్యోతి): అధికారులు బ్యాంకులను సమన్వయం చేసుకుంటూ రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి... జూన్ 2లోగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించాలని అదనపు కలెక్టర్ రాధికగుప్తా పేర్కొన్నారు. శుక్రవారం రాజీవ్ యువ వికాసంపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ జిల్లాలో అన్ని తరగతులకు సంబంధించి సీ కేటగిరీ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో అలసత్వం వద్దని, జిల్లా లక్ష్యాన్ని పూర్తిచేసే విధంగా చూడాలని ఆదేశించారు. బ్యాంకుల వారు దరఖాస్తుల పరిశీలన సత్వరమే పూర్తి చేసి మండల స్థాయి కమిటీలతో ఎంపిక పూర్తి లబ్ధిదారుల జాబితాను పంపాలన్నారు. యూనిట్ల ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, బ్యాంక్‌లు లబ్ధిదారులకు జూన్ 2వ తేదీలోగా మంజూరు పత్రాలు అందించాలన్నారు. సమావేశంలో కన్వీనర్ సాంబశివరావు, కాంతమ్మ, వినోద్‌కుమార్, ఝాన్సీరాణి, లీడ్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వరావు ఉన్నారు.

ఉలిక్కిపడ్డ మట్టి మాఫియా

» తట్టాబుట్టా సర్దుకొని పరార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎక్స్‌కవేటర్‌ను తరలిస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్, మే 23(ఆంధ్రజ్యోతి): 'మసక మసక చీకటిలో..' యథేచ్ఛగా మట్టి తవ్వకాలు కథనంతో ఉలిక్కిపడ్డ మట్టి మాఫియా వెంటనే తవ్వకాలను నిలిపివేసి యంత్రంతోపాటు లారీలను, సామగ్రిని కనిపించకుండా మరో చోటుకు తరలించి జాగ్రత్త పడ్డారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని పసిగట్టిన మట్టి మాఫియా నాయకుడు గురువారం రాత్రి 10 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము ఆరుగంటల వరకు మట్టి తవ్వకాలు చేపట్టాడు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూసి అక్కడున్న హిటాచి యంత్రం, టిప్పర్లను అక్కడి నుంచి తరలించాడు. అయితే మైనింగ్, రెవెన్యూ అధికారులు మాత్రం అంతా జరిగిపోయాక ఆరా తీయడం విశేషం. రెవెన్యూ అధికారులు వచ్చి చూసేసరికి అక్కడ గేట్‌కు తాళం వేసి ఉండటంతో వివరాలు తెలుసుకొని వెళ్లిపోయారు. మట్టి మాఫియాపై అధికారులకు ఫోన్లు చేస్తే స్పందించలేదని పలువురు స్థానికులు ఆరోపించారు. ఈ మట్టి తవ్వకాలు చేసింది బీఆర్ఎస్ నాయకుడు అయినందునే అధికారులు స్పందించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

28 నుంచి తంగడ్‌పల్లిలో వేంకటేశ్వరస్వామి జాతర

చేవెళ్ల, మే 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే జూన్ 3వ తేదీ వరకు చేవెళ్ల మండలం తంగడ్‌పల్లిలోని దశావతార సహిత లక్ష్మీఅలవేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జాతర నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు నడాదూర్ వెంకట్రాఘవన్, వెంకటనాథాచార్యులు తెలిపారు. శుక్రవారం చేవెళ్లలో విలేకర్లతో మాట్లాడుతూ... తంగడ్‌పల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. రాజగోపురం, కలశ ప్రతిష్ఠ, శ్రీవారి కల్యాణం, రథోత్సవం, దీపోత్సవం, గరుడ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు భారీగా తరలిరావాలని ఈ సందర్భంగా వారు కోరారు.



తంగడ్‌పల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపి రజక

కొడంగల్ రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణ రజక రిజర్వేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక అన్నారు. శుక్రవారం కొడంగల్‌లో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు సీహెచ్.రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశానికి కులగురువు డాక్టర్ శీనివాస స్వామిజీ, గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2016 డిసెంబర్ 26న అసెంబ్లీలో నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని మాట్లాడారని, ఇప్పుడు ఆయన తన మాటలను సాకారం చేయాలన్నారు. అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపాలని కోరారు. 18రాష్ట్రాల్లో రజకులు ఎస్సీలుగా కొనసాగుతూ ఆర్థిక, రాజకీయ, సామాజికంగా అభివృద్ధి చెందారన్నారు. 11రాష్ట్రాల్లో రజకులు ఓబీసీలుగా ఉండడంతో అన్ని రంగాల్లో వెనకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల కులగణన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి మిగతా రాష్ట్రాలకు ఆదర్శం కావాలని కోరారు. రవీందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కొడంగల్ నియోజకవర్గంలో రజకులు సంక్షేమ పథకాలకు ఆమడదూరంలో ఉన్నారన్నారు. ప్రతి వృత్తిదారుడికి ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణాలివ్వాలని, ఇళ్లు లేని పేదలకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. నిరుద్యోగ రజక యువతకు హాస్పిటళ్లలో, హాస్టల్, ప్రభుత్వ రంగ సంస్థల్లో దోబీ పోస్టులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు సి.అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు సి.బాలప్ప, జిల్లా సంయుక్త కార్యదర్శి సి.వెంకటప్ప, నాయకులు సుందరప్ప, మొగులయ్య, శ్యామప్ప, నవీన్, భీమప్ప, వెంకట్, పకీరప్ప, సతీష్ పాల్గొన్నారు.

లీకేజీలతో తాగునీరు వృథా

● పట్టించుకోని అధికారులు
● గోతులమయంగా సీసీ రోడ్డు



ఎలిమినేడులో పశువుల ఆస్పత్రి వద్ద పైప్‌లైన్ లీకేజీతో పారుతున్న తాగు నీరు

ఆదిబట్ల, మే 23(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు గ్రామంలో ప్రభుత్వ పశువుల ఆసుపత్రి వద్ద తాగునీటి పైపులైన్ లీకేజీలతో 20రోజుల నుంచి నీరు వృథాగా పోతోంది. రోడ్డుపై పారుతున్న తాగునీరు ఆసుపత్రి ఆవరణలో చేరి గుంతలమయంగా మారింది. ఎలిమినేడు మీదుగా మాధాపూర్, తిమ్మాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇదే కావడంతో వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. పైపులైన్ లీకేజీ నుంచి బస్సులు, లారీలు, ట్రాక్టర్లు పోతుండటంతో నీటి పారకంతో గుంతలు ఏర్పడుతున్నాయి. పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించాలని అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే 20 రోజుల నుంచి తాగునీరు వృథా పోతుండడంతో ఎలిమినేడులోని 5, 6, 7, 8 వార్డులకు నీటి సరఫరా కావడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. గతంలో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఉండడంతో గ్రామాల్లో ఏమైనా సమస్యలు వస్తే పరిష్కరించేవారు. కానీ పంచాయతీ పాలకవర్గాల కాలం ముగిసి ఏడాదిన్నరగా ప్రజాప్రతినిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ అధికారులకు చెప్పినా పట్టిచుకోవడంలేదని గ్రామస్తులు అంటున్నారు. పైపులైన్‌కు మర్మతులు చేయకుంటే కొత్తగా వేసిన సీసీ రోడ్డు పాడైపోతుంది. ఇప్పటికైనా అధికారులు పైపులైన్ లీకేజీకి మర్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతంగా ఎర్రవల్లి

● నాగుల ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులు
● రూ.2కోట్ల సీఎస్ఆర్ నిధులు ఇచ్చేందుకు కంపెనీల ఆసక్తి



ఎర్రవల్లి ఏరియల్ వ్యూ

వికారాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మండలంలోని ఎర్రవల్లి గ్రామం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందనుంది. ఈ మధ్య కాలంలోనే ఆలయ సమీపంలోని చెరువు కట్టపై ఉన్న గుట్టపై నూతనంగా నిర్మించిన నాగుల ఎల్లమ్మ దేవాలయ పరిసరాల్లో బ్యుటిఫి కేషన్ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈ ప్రాంతంలో నెల కొన్న వివిధ కంపెనీలు 'సోషల్ రెస్పాన్సిబులిటీ ఫండ్స్' కార్యక్రమం కింద రూ.2కోట్లు విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ నిధులతో చెరువులో బోటింగ్, పర్యాటకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, స్నాక్స్ స్టాల్స్ వాటర్ స్పోర్ట్స్, మినీ ఫంక్షన్ హాల్ విత్ కిచెన్ షెడ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

ఆలయంలో ధూపదీప నైవేద్యాలు

నూతనంగా నిర్మించిన నాగుల ఎల్లమ్మ ఆలయంలో నిత్యం ధూపదీప నైవేద్యాల నిర్వహణకు వసతులు కల్పించేందుకు కంపెనీలు అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే ఈ పనులన్నీ వర్షాకాలం తరువాత నిర్వహించేందుకు అంగీకరించినట్లు మాజీ సర్పంచ్, ఆర్పీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ తెలిపారు. కంపెనీ యాజమాన్యాలిచ్చే నిధులతో పాటు స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మంత్రి కోమటిరెడ్డిని సన్మానించిన ఎమ్మెల్యే

చేవెళ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాగా హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసానికి వెళ్లిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఆయనను సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వెంకట్‌రెడ్డి మున్ముందు మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని దేవుని కోరుకున్నట్లు ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అలాగే చేవెళ్ల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంత్రిని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



మంత్రి వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే యాదయ్య

ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ కష్టాలు

● కిలో మీటర్ పొడవునా వాహనాల బారులు

తాండూరు, మే 23 (ఆంధ్రజ్యోతి):తాండూరు-కొడంగల్ రోడ్డు మార్గంలో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ పై శుక్రవారం మధ్యాహ్నం వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ కష్టాలుపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు వ్యయ ప్రయాసతో క్లియర్ చేశారు. కల్వర్టు నిర్మాణం వద్ద రాకపోకలు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. కిలో మీటర్ పొడవున ఇరువైపులా వాహనాలు నిలిచాయి. గంట పాటు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగాయి. తాండూరు నుంచి కొడంగల్, మహబూబ్‌నగర్ వెళ్లే ప్రయాణికులు, కొడంగల్ వైపు నుంచి తాండూరులోకి ఎంట్రీ అయ్యే ప్రయాణికులు ట్రాఫిక్ తిప్పలు ఎదుర్కొన్నారు. కొంత కాలంగా ఏ చిన్న సమస్యొచ్చినా ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ స్తంభిస్తోంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.



ఫ్లైఓవర్‌పై నిలిచిన వాహనాలు

108 వాహనంలో గర్భిణి ప్రసవం



శిశువుకు సపర్యలు చేస్తున్న సిబ్బంది

మహేశ్వరం, మే 23(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులొచ్చిన గర్భిణిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా డెలివరీ అయ్యింది. తుక్కుగూడ ఫ్యాబ్ సిటి సమీపంలో జార్ఖండ్‌కు చెందిన మహిళ కూలీగా పనిచేస్తోంది.గర్భిణి అయిన ఆమెను కాన్పుకోసం 108 వాహనం సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు తీవ్రం కావడంతో సిబ్బంది వాహనంలోనే డెలివరీ చేశారు. ఆ మహిళ ఆడబిడ్డకు జన్మ నిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని 108 వాహన సిబ్బంది తెలిపారు.

నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి



వికారాబాద్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ న్యూ డెమోక్రసీ నాయకులు

వికారాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి):మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. నాయకులు మైపాల్, మహేందర్ మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని, ఆదివాసీలపై దాడులను ఆపాలని కోరారు. బూటక ఎన్‌కౌంటర్లతో ఆదివాసీలను, మావోయిస్టులను హతమార్చడం దారుణమన్నారు. అడవి సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకే కేంద్రం ఈ నరమేధాన్ని సృష్టిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే శాంతిచర్చలు జరపాలని నాయకులు డిమాండ్ చేశారు.

ఆదివాసీలపై దాడులను వెంటనే ఆపాలి

తాండూరు, మే 23(ఆంధ్రజ్యోతి) : బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరారు. ఆదివాసీలపై దాడులను వెంటనే ఆపాలన్నారు. నారాయణపూర్, దంతేవాడ, బీజాపూర్, కొండగావ్ జిల్లాలతో పాటు తెలంగాణలో కర్రెగుట్ట అడవులను జల్లెడ పట్టి ఆదివాసీలను హత్య చేయడం దుర్మార్గ చర్య అన్నారు. మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం బలగాలతో ఏకపక్షంగా కాల్పులు జరిపి హత్య చేయడం అమానవీయం అన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల విరాళం



విరాళం అందించిన దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

చేవెళ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మడల పరిధిలోని తంగడ్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్, పద్మజ దంపతులు ఆలయ నిర్మాణానికి తమ వంతుగా రూ. 2.9లక్షలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. వీరి స్ఫూర్తితో మరింత మంది ముందుకు వచ్చి ఆంజనేయాలయ అభివృద్ధి విరాళాలు అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనూష సత్తయ్యగౌడ్, నాయకులు రాములుగౌడ్, చంద్రయ్యగౌడ్, వెంకటయ్య, కె.నారాయణ, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బషీరాబాద్ సీహెచ్‌సీని సందర్శించిన డీసీహెచ్ఎస్

బషీరాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ను డీసీహెచ్ఎస్ అధికారి డాక్టర్ ఆనంద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆసుపత్రిలో కలియతిరిగారు. వైద్యం కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆయన మట్లాడుతూ సీహెచ్‌సీలో 14 మంది వైద్యులు అవసరం కాగా నలుగురు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుతాయన్నారు. ఆస్పత్రిలో గర్భిణులకు నార్మల్ డెలివరీలు జరిగేలా నర్సింగ్ సిబ్బంది కృషి చేయాలని అధికారులు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టి ఆసుపత్రి సందర్శణకు వచ్చిన డీసీహెచ్ఎస్‌కు డాక్టర్లు, వైద్య సిబ్బంది శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలి

శామీర్‌పేట, మే 23(ఆంధ్రజ్యోతి): శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న వివిధ అంశాలను పాఠశాలల్లో విద్యార్థులకు తప్పక బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి సూచించారు. తూంకుంటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం డీఈవో సందర్శించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందింపజేసేందుకే ప్రభుత్వం టీచర్లకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తోందన్నారు. ఎంఈవో కమలాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించేలా బోధనా విధానంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు రాజు, శశికుమార్, పుష్పలత, శ్వేత, హరిశంకర్, శివనాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి

ఘట్‌కేసర్, మే 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి అన్నారు. ఘట్‌కేసర్‌లోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ఇలాంటి శిక్షణ తరగతులు ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధికి దహదపడుతాయన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లినప్పుడు అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికస్థోమత లేకపోయినా ప్రైవేట్ పాఠశాలలకు పంపించే పిల్లలను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు.

యువతకు ఉత్తమ భవిష్యత్తునిస్తాం

» 29న తాండూరులో జాబ్‌మేళా: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మే 23(ఆంధ్రజ్యోతి):ఈజీఎంఎం ఆధ్వర్యంలో 50కంపెనీలను రప్పించి 10వేల ఉద్యోగాలు కల్పించేలా తాండూరులో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 29న నిర్వహించే జాబ్‌మేళా పోస్టర్‌ను శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగం ఇచ్చేలా కృషిచేస్తానని చెప్పారు. 29న వినాయక కన్వెన్షన్ హాల్‌లో జాబ్ మేళా ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్ చదివిన నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొటే వారి అర్హతను బట్టి ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పారు. ప్రతి గ్రామం నుంచి నిరుద్యోగులొచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జాబ్‌మేళాకు యువతీ యువకులు హాజరయ్యేలా కాంగ్రెస్ నాయకులు, వ్యాపార, కుల సంఘాల నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఉమ్మడి డీసీసీబీ ఉపాధ్యక్షులు రవీందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, నాయకులు పట్లోళ్ల నర్సిములు, నర్సిరెడ్డి, హబీబ్‌లాల, ఉత్తంచంద్, అజయ్‌ప్రసాద్, రామకృష్ణ, నాగప్ప, నర్సిములు, రవికుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, మే 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన కార్మికుడికి సహాయం చేసి ఎమ్మెల్యే సబితారెడ్డి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం వివాహ కార్యక్రమాలకు హాజరై తిరిగి వెళ్తుండగా మహేశ్వరం గేటు సమీపంలో రోడ్డు పక్కన పనిచేస్తున్న కూలీని ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే ప్రమాదాన్ని గమనించి తన వాహనాన్ని నిలిపారు. ప్రమాద విషయాన్ని తెలుసుకొని గాయపడిన వ్యక్తిని ఆమె ఆసుపత్రికి తరలించారు. దీంతో అక్కడున్న కూలీలందరూ సబితారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



రోడ్డు ప్రమాద బాధితున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

'ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్నా పట్టించుకోరా?'

బషీరాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కబ్జాలు చేసి ఇళ్లు నిర్మిస్తున్నా పట్టించుకోరా? అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బషీరాబాద్ రెవెన్యూ అధికారులకు ఆయన ఫిర్యాదు చేశారు. గొట్టిగకలాన్‌లో 5గుంటల ప్రభుత్వ భూమిలో ఇల్లు కడుతున్నారని, పంచాయతీ పట్టించుకోవడం లేదన్నారు. అక్రమంగా ఇల్లు కడుతున్న నీలి నర్సింహులు, నీలి వెంకటప్పలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ సర్కారు భూమిని కాపాడకుంటే గ్రామస్తులతో కలిసి రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు.

రేపు సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

శామీర్‌పేట, మే 23(ఆంధ్రజ్యోతి): తూంకుంటలోని రాష్ట్ర స్పోర్ట్స్‌స్కూల్ గ్రౌండ్స్‌లో ఈ నెల 25న మేడ్చల్ జిల్లా స్థాయిలో సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామని నిర్వహణ కమిటీ కార్యదర్శి రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. మేడ్చల్ జిల్లా పాఠశాలలకు, కళాశాలల ఆసక్తిగల అండర్-6, 8, 10, 12 ఏజ్ గ్రూప్ విద్యార్థులు పాల్గొనొచ్చని తెలిపారు. అథ్లెటిక్స్ పోటీల్లో పరుగు పందెం, జంపింగ్, త్రోయింగ్ ఇవెంట్లను నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు పుట్టిన తేదీ సర్టిఫికెట్లను వెంట తీస్కొచ్చి 25న మధ్యాహ్నం 3గంటలలోపు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఇక్కడ విజేతలైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జూన్ 1న సికింద్రాబాద్‌లోని జింఖాన గ్రౌండ్స్‌లో స్టేట్ అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని తెలిపారు.

గనుల్లో అక్రమ తవ్వకాలపై నజర్

» ఓగీపూర్‌లో నాపరాతి గనులను పరిశీలించిన మైన్స్ అధికారులు

తాండూరు రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిధిలోని కరన్‌కోట్, ఓగీపూర్ నాపరాతి గనుల్లో అకమ తవ్వకాలపై మైన్స్ అధికారుల తనిఖీ చేశారు. శుక్రవారం తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ, ఆర్ఐ నిర్మలతోపాటు విద్యుత్ శాఖ అధికారులు నాపరాతి గనుల అక్రమ తవ్వకాలపై విచారణ జరిపించారు. నాపరాతి గనుల వద్ద ఎవరూ లేకపోవడంతో ఆ గనులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. ఏ మేరకు తవ్వకాలు జరిపారు, ఎవరి పేరిట విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయనే వివరాలు లైన్‌మెన్ కర్రెప్ప, అసిస్టెంట్ లైన్‌మెన్ మహబూబ్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్రమ తవ్వకాలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్ల సర్వీస్ నంబర్లు చందన్‌కేరి శేఖర్ 2230-123, ఏ-1 స్టోన్ క్వారీ 2230-200, శ్రీనివాస్ స్టోన్ 2219-1480, రేవణ సిద్ధేశ్వర 2230-389 నంబర్లకు సంబంధించి నాలుగు సర్వీస్ కనెక్షన్లు పరిశీలించి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ అక్రమ తవ్వకాలు ఓ పార్టీ నాయకునికి సంబంధించినవని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై సమగ్ర వివరాలు సేకరించారు. గనుల్లో అనుమతి లేకుండా ఎవరైనా అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని మైన్స్ ఏడీ సత్యనారాయణ హెచ్చరించారు. మైన్స్ ఆర్ఐ నిర్మల, విద్యుత్ శాఖ ప్రతినిధులు కర్రెప్ప, మహబూబ్ ఉన్నారు.



నాపరాతి గనులకు తీసుకున్న అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేస్తున్న లైన్‌మన్

మూడు నెలల కోటా ఒకేసారి..!



(ఐదో పేజీ తరువాయి)

కొత్త రికార్డులు సృష్టించాయి. గతంలో డీలర్లు నెలంతా బియ్యం పంపిణీ చేస్తుండే వారు. దొడ్డు బియ్యం సరఫరా చేసే సమయంలో సాధారణంగా ప్రతినెలా 60 నుంచి 70శాతం వరకు మాత్రమే కార్డుదారులు రేషన్ తీసుకునే వారు. కార్డుదారులు వీలున్నపుడే రేషన్ బియ్యం తీసుకునే వారు. దీంతో ఒకేసారి సరుకు రాకున్నా పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. ఉమ్మడి జిల్లాలో ఆహార భద్రత కార్డులు ఉన్నవారు దాదాపు 13.75 లక్షల మంది ఉన్నారు. కార్డుదారులకు ప్రతి నెలా దాదాపు 30వేల టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. ప్రతి నెలా ఇందులో 20 నుంచి 22వేల వేల టన్నుల బియ్యం మాత్రమే అమ్ముడయ్యేవి. అయితే సన్న బియ్యం పంపిణీ తరువాత పరిస్థితి పూర్తిగా మారింది. గతంలో 70శాతం మంది మాత్రమే రేషన్ తీసుకోగా ఇపుడు 95 శాతానికిపైగానే రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. సన్నబియ్యంపై ప్రజలు ఆసక్తిని కనబరచడంతో రేషన్ షాపులన్నీ కళకళలాడుతున్నాయి. సన్న బియ్యం నాణ్యతగా ఉండడంతో వీటిని తీసుకునేందుకు రేషన్‌కార్డుదారులు బారులు తీరుతున్నారు. ఇదిలా ఉంటే ఇపుడు కేంద్రం ఇచ్చిన ఆదేశాలతో ఒకేసారి మూడు నెలల కోటా పంపిణీ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడునెలలకు సరిపడా ఒకే సారి సన్న బియ్యం పంపిణీ చేయడం సాధ్యమా? అనేదానిపై అధికారయంత్రాంగం నుంచి వివరాలు సేకరిస్తోంది. సన్నబియ్యం నిల్వలు, రవాణా, స్టాక్ పాయింట్ల వివరాలపై ఉన్నతస్థాయి సమావేశాలు కూడా నిర్వహిస్తోంది. మరో వైపు రేషన్ సరఫరాపై డీలర్లను కూడా సమాయత్తం చేస్తోంది. ఇదిలా ఉంటే ఒకేసారి మూడు నెలల కోటా ఇవ్వడంపై కొందరు డీలర్లు కూడా కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి డీలర్ల సంఘం లేఖ రాసింది. మూడు నెలల కోటాను ఒడిదుడుకులు లేకుండా సవ్యంగా పంపిణీ చేయాలని లేఖలో కోరారు. గన్నీ సంచుల డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జూన్ నెలంతా తమకు ఊపిరి సలపని పని ఉంటుందని తరువాత రెండు నెలల పాటు ఖాళీగా ఉండాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఆర్థిక సమస్యను అర్థం చేసుకుని అడ్వాన్స్ కమీషన్ విడుదల చేయాలని కోరారు. రెండు నెలలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన కమీషన్ కూడా ఇవ్వాలని డీలర్లు కోరారు.

మూడు జిల్లాల్లో 90వేల టన్నుల బియ్యం అవసరం

ఒకేసారి మూడు నెలల కోటా ఇవ్వడం వల్ల మూడు జిల్లాలకు దాదాపు 90వేల టన్నులకుపైగా సన్న బియ్యం అవసరం ఉంది. రంగారెడ్డిజిల్లాలో ప్రతి నెలా 13,500 మెట్రిక్ టన్నులు, మేడ్చల్ జిల్లాలో 10,995 మెట్రిక్ టన్నులు, వికారాబాద్ జిల్లాలో 5782 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా విడుదల చేస్తారు. ఈ లెక్కన మూడు జిల్లాలకు ఒకే విడత జూన్, జూలై, ఆగస్టుకు సరిపడా కోటా విడుదల చేయాలంటే దాదాపు 90వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం. ఇంత పెద్ద మొత్తంలో నిల్వ చేసేందుకు గోదాములు లేనందున రేషన్ పంపిణీ మొదలు కాగానే ఆయా డీలర్‌షాపుల వద్ద ఉన్న డిమాండ్ మేరకు నిరంతరం ప్రధాన గోదాముల నుంచి సరుకు పంపిణీకి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం అవసరమైన రవాణా వ్యవస్థను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే సన్న బియ్యం మూడునెలలకు సరిపడా అందుబాటులో లేకుంటే మరో నెలగడువు పొడిగించే అవకాశాలు కూడా ఉంటాయని అధికారవర్గాలు తెలిపాయి.

మూడు జిల్లాల్లో రేషన్ పంపిణీ ఇలా...

జిల్లా	రేషన్ షాపులు	ఆహార భద్రత కార్డులు	ప్రతి నెలా బియ్యం పంపిణీ (మెట్రిక్ టన్నుల్లో)
రంగారెడ్డి	936	5,78,500	13,500
మేడ్చల్	619	5,36,755	10,955
వికారాబాద్	588	2,50,563	5,782

వీవీహెచ్ఎస్‌పై స్టేటస్ కో

విద్యాలయాన్ని కూల్చొద్దన్న హైకోర్టు



విజయ విద్యాలయ హై స్కూల్

తాండూరు, మే 23(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఉన్న ఏకైక ఎయిడెడ్ పాఠశాల విజయ విద్యాలయ ఉన్నత పాఠశాలను కూల్చివేయొద్దని, యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు స్టేటస్‌కో జారీ చేసింది. కొంత కాలం క్రితం మున్సిపల్ అధికారులు యజమాన్య హక్కును మార్చారు. 200 చదరపు గజాల్లో ఈ పాఠశాల ఉంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ చదివిన ఎంతో మంది ఉన్నతోద్యోగులుగా ఎదిగారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ అధికారులు మ్యుటేషన్ చేశారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ వీవీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ హైకోర్టును, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులను ఆశ్రయించింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు సూచించింది. ఈ విషయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు మున్సిపల్ రెవెన్యూ అధికారులను వివరణ కోరినట్లు సమాచారం.

ఉపాధి కల్పనలో మహిళా సంఘాల పాత్ర కీలకం

» రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యదర్శి దివ్య



మాట్లాడుతున్న రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యదర్శి దివ్య

కొడంగల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పనలో మహిళా సంఘాల పాత్ర కీలకమని, పేదలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యదర్శి దివ్య అన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో తెలంగాణ సమ్మిళిత జీవనోపాధుల కార్యక్రమం, మహిళా సంఘాల పాత్రపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో సీఆర్‌పీల సహకారంతో పేదలను గుర్తించి, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎలాంటి పైరవీలకు, అవకతవకలకు తావులేకుండా నిజమైన పేదలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ముఖ్య శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, సుధీర్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుడు జానకి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంజమ్మ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, సెర్ప్ రజిత, టీజీఐఎల్‌పీ స్టేట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జయరాం, రవీందర్‌రావు, సెర్ప్ డీపీఎంలు రామ్మూర్తి, శ్రీనివాస్, ఆర్ఎం ఉదయ్‌కుమారి, టీజీఐఎల్‌పీ జిల్లా కో ఆర్డినేటర్ గోనే రవి, మండల కో ఆర్డినేటర్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

పద్యం సృజనాత్మకతను పెంచుతుంది

వికారాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): తెలుగు పద్యం విద్యార్థుల ఏకాగ్రతకు, సృజనాత్మకతకు దోహదపడుతుందని శతావధాని, సాహితీవేత్త డాక్టర్ మలుగ అంజయ్య అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణలో భాగంగా శుక్రవారం డైట్ కాలేజీలో తెలుగు పండిత్‌ల శిక్షణకు ఆయన హాజరై మాట్లాడారు. అవధాన విద్య తెలుగు భాషకే వన్నె తెచ్చిందన్నారు. వెయ్యి సంవత్సరాలుగా అనేక ప్రక్రియల్లో పద్యం నిలిచిందని చెప్పారు. 6వ శతాబ్దం నుంచి తెలుగు పద్యం ఉన్నదన్నారు. మహా భారతం ఆంధ్రీకరణ తర్వాత లక్షణ బద్ధమైన పద్యం వచ్చిందన్నారు. పద్యంలో కావ్యాలు, శతకాలు, ఖండ కావ్యాలు, రామాయణ, భారత, భాగవతాలు తెలుగుభాషలో వచ్చాయని గుర్తుచేశారు. నాటి కవులు పద్యమే ప్రాణంగా భావించారన్నారు. ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ మున్నూరు రాజు మాట్లాడుతూ.. పద్యం తెలుగు వాడి నాడి అని, పద్యం రస నైవేద్యం అన్నారు. భాషోపాధ్యాయులు పద్యాలు తాము నేర్చుకుంటూ విద్యార్థులకు నేర్పాలన్నారు. కార్యక్రమంలో కోర్సు కో-ఆర్డినేటర్ రామ్‌మస్త, ఎస్వో రజిత, డీఆర్పీలు సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్, పరమేశ్వర్, రాజ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం


శామీర్‌పేట, మే 23(ఆంధ్రజ్యోతి): రోడ్లకు అడ్డంగా, ప్రభుత్వ జాగాల్లో కట్టే నిర్మాణాలను కూల్చి అక్రమార్కులపై క్రిమినల్ వేటు వేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ హెచ్చరించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయంజాల్‌లోని తిరుమల, ఎస్సీ కాలనీల్లో రోడ్లకు అడ్డంగా, ఇష్టారాజ్యంగా చేపట్టిన నిర్మాణాలను కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్ లు శుక్రవారం కూల్చేయించారు. ప్రజలు మున్సిపల్ నిబంధనల మేరకే భవన నిర్మాణాలను చేపట్టాలన్నారు. రోడ్డు స్థలాలను, ఫుట్‌పాత్‌లను కబ్జా చేస్తే సహించేది లేదని అధికారులన్నారు.

అదనపు సంపాదన అభినందనీయం

బొంరాస్‌పేట, మే 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాల్లో అదనపు ఆదాయం ఆర్జిస్తున్న నాగిరెడ్డిపల్లి గ్రామ రైతు చింతకింది వెంకటయ్యను సెర్ప్ సీఈవో దివ్య అభినందించారు. శుక్రవారం ఆమె కొడంగల్ పర్యటన అనంతరం హైదరాబాద్‌కు వెళ్తూ నాగిరెడ్డిపల్లిలో చింతకింది వెంకటయ్య పొలాన్ని సందర్శించారు. పొలంలో వ్యవసాయంతో పాటు కూరగాయలు, కోళ్లపెంపకం, ఫాం పాండ్స్ ఏర్పాటు చేసి చేపల పెంపకం చేయడం అభినందించారు. వీటితో తాను అదనంగా రూ.40వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు రైతు తెలిపారు. కాగా అంతకు ముందు అధికారులు పోషణ, వనితల వ్యాపారం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అధికారి వెంట కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు ఉన్నారు. అలాగే కొడంగల్ మండలం అంగడిరైచూర్‌లో మహిళాశక్తి కుట్టు కేంద్రాన్ని అధికారులు పరిశీలించారు.

స్వదేశీ ఉత్పత్తులపై దృష్టి సారించాలి

ఘట్‌కేసర్, మే 23(ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఉత్పత్తుల కొనుగోళ్లపై ప్రతీ ఒక్కరు దృష్టిసారించి దేశ అర్థికాభివృద్ధికి పాటుపడాలని కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ క్షేత్ర సేవ ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పోచారం పరిధి అన్నోజిగూడలోని విద్యా విహార్ పాఠశాల(ఆర్వీకే)లో జరిగిన కార్యకర్త వికాస వర్గ సార్వజనికోత్సవానికి ప్రధానవక్తగా హాజరయ్యారు. వచ్చే సంవత్సరం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో అనేక విషయాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. కుటుంబ విలువలు పెంపొదించడం, పర్యావరణంపై దృష్టి, స్వదేశీ వంటి అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. మన దేశ విలువలు, సంస్కృతిని ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయని గుర్తుచేశారు. నేడు దేశంలో ఐక్యత కన్పిస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్ నాలుగు రోజులే సాగినా అది ప్రపంచ దేశాలను ఆకర్షించిందని గుర్తు చేశారు. దేశంలో గొప్పగొప్ప పుణ్యక్షేత్రాలు దట్టమైన అడవుల్లో ఉన్నాయని, గిరిజన భక్తుల వద్దకు నేడు మనం వెళ్లగలుగుతున్నాం అన్నారు. దేశంలో గిరిజన ప్రాంతాల్లో 12వేల ప్రాజెక్టులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ కార్యకర్తలు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కన్హా శాంతివన మేనేజర్ వినీత్‌సింగ్ రమావత్, లక్కినేని ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సేవకుల కర్ర విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్కా చంద్రశేఖర్



రైతులతో మట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

తూకాల్లో నిబంధనలు అతిక్రమించొద్దు

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బషీరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం తూకాల్లో నిబంధనలు అతిక్రమించొద్దని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం బషీరాబాద్ మండలం కాశీంపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రం నిర్వాహకులు, రైతులతో సమావేశమై తూకాల విషయంపై చర్చించారు. ఏ మేరకు తూకాలు జరిగాయని ఆరాతీశారు. రైస్ మిల్లుల్లో బస్తాకు 42 కిలోలు ఉంటేనే తీసుకుంటున్నారనే దానిపై రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం తూకాల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించవద్దని నిర్వాహకులకు సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లుకు పంపించాలని నిర్వాహకులను ఆదేశించారు. అకాల వర్షాలు పడుతున్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వచ్చే ఐదేళ్లలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మహిళలకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీ ర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండ లం ఎలికట్ట, మొగిలిగిద్ద గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు ఆయన భూమిపూజ చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో బీఆర్ఎస్ పదేళ్లు ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు తాను మొగిలిగిద్దలో పర్యటించినపుడు జయమ్మ-వెంకటయ్య దంపతులు ప్లాస్టిక్ కవర్ కప్పుకుని తమ ఇద్దరు ఆడపిల్లలతో నివసించడాన్ని చూసి ఆవేదన చెందానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే వారికి ఇల్లు మంజూరు చేస్తానని మాటిచ్చానని, ఆ మాట ప్రకారం ఈ రోజు వారి ఇంటి నిర్మాణా నికి ముగ్గు పోశానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీలాల్, నాయకులు శ్యాంసుందర్, శ్రీశైలం, శివలింగం, అంబటి రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన ఏసీపీ

షాద్‌నగర్ డివి జన్ నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పూలబొకే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దని, పేదలకు న్యాయం చేయాలని సూచించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కమనీయం.. వేంకటేశ్వరుడి కల్యాణం

తలకొండపల్లి, మే23(ఆంధ్రజ్యోతి): జూలపల్లిలో నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. జూలపల్లి, మండలంలోని వివిధ గ్రామాల భక్తులు, నాయకులు తరలొచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి, ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్ హాజరయ్యారు. వేదమంత్రాలతో అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ఎమ్మెల్యే, ఆచారి, అతిథులను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. ఉదయం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠలను నిర్వహించారు. తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. ఆధ్యాతిక కార్యక్రమాలు, దైవచింతనతో మానసిక ప్రశాంత లభిస్తుందన్నారు. సన్మార్గంతో దైవానుగ్రహం దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డి.ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.నర్సింహ, నాయకులు లక్ష్మీదేవిరఘురాములు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి గ్రహణం

(ఐదో పేజీ తరువాయి)

మార్పులు చేసి పనులు ఎటూకాకుండా చేశారు. దీంతో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని స్థానికులు శుభకార్యాలు, ఇతర పనులకు వినియోగించుకుంటున్నారు. ఇలాగే వది లేస్తే కొత్త భవనం కూడా శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉంది. గత పాలకుల కమీషన్ల కక్కుర్తితోనే నిర్మాణంలో మార్పులు చేశారని, అనుకున్న బడ్జెట్‌తో నిర్మిస్తే ఇప్పటికే గ్రంథాలయం ప్రారంభమై ఉండేదని స్థానికులు అంటున్నారు. నూతన గ్రంథాలయ భవనానికి మిగిలిన పనులు పూర్తిచేసి ప్రారంభించాలని పాఠకులు కోరుతున్నారు.

బడ్జెట్‌కు ప్రతిపాదనలు పంపాం



ముందుగా అనుకున్న డిజైన్ ప్రకారం నిర్మిస్తే కోటి రూపాయలతో కీసరలో గ్రంథాలయం పూర్తయ్యేది. గత పాలకుల కక్కుర్తితో డిజైన్‌లో మార్పులు చేశారు. దీంతో నిర్మాణ బడ్జెట్ పెరిగింది. మరో రూ.65లక్షలు కావాల్సి ఉంది. మరింత బడ్జెటివ్వాలని ప్రతిపాదనలు పంపాం. రానున్న వారం రోజుల్లోపు అనుమతులు రాగానే పనులు మొదలుపెట్టి, గ్రంథాలయం ప్రారంభించే చర్యలు తీసుకుంటాం.

- బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి,
జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

భూ నిర్వాసితులకు పరిహారం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): తాండూరులో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి భూములు కోల్పోయిన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారాన్ని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కుటుంబాలకు అందజేశారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సర్వే నంబర్ 52/7లో మూడెకరాల భూమిని కోల్పోయిన కేతావత్ మల్కిబాయి, కేరిబాయి కుటుంబాలకు రూ.54లక్షల చెక్కును అందజేశారు. ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకునేందుకు భూమిని ఇచ్చిన గిరిజన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, జిలాని, హబీబ్ లాల, రాము, ప్రభాకర్‌గౌడ్ ఉన్నారు.

కొనసాగుతున్న కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ జాతర



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

తాండూరు రూరల్, మే 23, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ జాతర కనుల పండువగా కొనసాగుతోంది. నెలరోజులపాటు జరిగే ఈ జాతరకు భక్తులు నిత్యం పెద్దఎత్తున తరలివస్తున్నారు. ముఖ్యంగా రెండో శుక్రవారం కావడంతో తాండూరు చుట్టుపక్కల గ్రామాలతోపాటు సరిహద్దు కర్ణాటక నుంచి వివిధ గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చారు. కొందరు మహిళా భక్తులు వేపచీర ధరించి గండజ్యోతిని మోస్తూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్, ఆలయ పూజారి శ్రీనివాస్, రవి, మాజీ సర్పంచ్ సాయిలు పాల్గొన్నారు. అదేవిధంగా కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జాతర వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతి



అచ్చిని నర్సింహ(ఫైల్)

ఘట్‌కేసర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అచ్చిని నర్సింహ(59)అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన నర్సింహ బీజేపీలో క్రియాశీలకంగా పనిచేశారు. రెండు రోజుల కిందట అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. నర్సింహ మృతి విషయం తెలుసుకున్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మేడ్చల్ మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడిలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల్లో గ్రామస్తులు, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నర్సింహ మృతి బీజేపీకి, ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు తీరని నష్టమని ఈటల అన్నారు.

విద్యుత్ అధికారులు, సబ్‌స్టేషన్ ఫోన్ నంబర్ల మార్పు

ధారూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ శాఖ అధికారుల, విద్యుత్ సబ్‌స్టేషన్ ఫోన్ నంబర్లు మారినట్లు మండల ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ ప్రమోద్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యుత్ ఏఈ ఫోన్ నంబరు 8712469741, ధారూరు విద్యుత్ సబ్‌స్టేషన్ 8712469805, నాగారం సబ్‌స్టేషన్ 8712469799, నాగసమందర్ సబ్‌స్టేషన్ 8712469816, మధుసూదన్ ఫోర్‌మన్ నంబరు 8712469781 అని తెలిపారు. వినియోగదారులు పై నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

'ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తున్నాం'

పరిగి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో 27మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని సీపీఐ పరిగి డివిజన్ కార్యదర్శి ఫీర్‌మహ్మద్ ఒక ప్రకటనలో ఖండించారు. చర్చలు జరుపాలని మావోయిస్టులు పదేపదే విజ్ఞప్తులు చేసినా వాటిని పట్టించుకోకుండా కేంద్రప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు కలిసి చర్చల ద్వారా కాకుండా ఎన్‌కౌంటర్ల ద్వారా నిర్మూలించాలని పూనుకుకోవడం అప్రజాస్వామికమన్నారు. మావోయిస్టులపై పారామిలటరీ దళాల చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

అదుపు తప్పితే అంతే!



నీళ్లపల్లి- మైల్వార్ అటవీ ప్రాంతం మార్గంలో సూచిక బోర్డు లేకుండా తవ్వకాలు



కులకచర్ల: బొంరెడ్డిపల్లి మార్గంలో ధ్వంసమైన కల్వర్టు

బషీరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు రక్షణ చర్యలు విస్మరిస్తున్నారు. మండలంలోని నీళ్లపల్లి-మైల్వార్ మార్గం ఏకాంబర రామలింగేశ్వరాలయం ప్రధాన ద్వారం సమీపంలో కొత్తగా డబుల్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అటవీ ప్రాంతం రోడ్డు పక్కన విస్తరణ పనుల్లో భాగంగా ఓ వైపు హిటాచీలతో గుంతలు తవ్వారు. ఈ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాద కారంగా మారింది. ప్రయాణికులకు రోడ్డు పక్కన తవ్వకం కనిపించేలా తగిన సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదం అంచున రాకపోకలు సాగిస్తున్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలోని పాంబండ నుంచి బొంరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు ధ్వంసమైంది. కల్వర్టుపై బీటీరోడ్డు వేసి సంవత్సరం కూడా కాలేదు అప్పుడే పాడైపోయింది. గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కానీ రాత్రివేళల్లో ఆటోలు, బైకులు, కారుపై వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగక ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి వర్షాకాలానికి ముందు కల్వర్టు మరమ్మతు చేయాలని ప్రయాణికులు, గ్రామస్థులు కోరుతున్నారు.

సేకరించిన పట్టా భూముల్లో సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

దుద్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగచర్ల, పోలెపల్లి, హకీంపేట్ గ్రామాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూముల్లో అధికారులు శుక్రవారం సర్వే చేపట్టారు. తహసీల్దార్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఎక్సైజ్, నీటి పారుదల, అటవీ, ఆర్‌డబ్ల్యూఎస్, హార్టికల్చర్, సెరికల్చర్ శాఖల అధికారులు వివిధ రకాల చెట్లు, బోరు మోటార్లు, బోరు బావులు, ఈత, తాటి చెట్లకు సంబంధించిన సర్వే నిర్వహించారు. రైతులు తమ పొలాల్లో ఉన్న వాటిని అధికారులకు చూపించారు. అధికారులు వాటిని నమోదు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, ఎస్ఐలు యాదగిరి, రవూఫ్, సత్యనారాయణ, రవిగౌడ్, ఏఈ శ్రీకాంత్ రెడ్డి, మహేశ్, ఫారెస్టు ఎఫ్ఎస్‌వో రమేశ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

పరిగి, మే 23 (ఆంధ్రజ్యోతి): సయ్యద్‌మల్కాపూర్‌లో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రహీంపటేల్ శుక్రవారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన నలుగురికి కలిపి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.లక్షా 62వేలు విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సుంకరి రాజు, మన్నరి రాములు, అంజనేయులు, రాజు, నడిపి రమేశ్, కుర్వ మల్లేశ్, జంగయ్య, నర్సింహులు, దాస్ పాల్గొన్నారు.

క్షయను నిర్మూలిద్దాం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



దోమ మండల కేంద్రంలో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్, మే 23 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు వంద రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీబీ ప్రోగ్రాం అధికారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రవీందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం అంగడిరైచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 41 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు బుష్రఫాతీమా, వైద్య సిబ్బంది రహత్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీబాయి, మహేశ్, అనంతలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దోమ: దోమ పీహెచ్‌సీలో శుక్రవారం టీబీ ముక్తాభియాన్ కార్యక్రమం నిర్వహించారు. టీబీ అధికారి రవీందర్‌యాదవ్ క్షయవ్యాధి, రక్తపోటు, హెచ్ఐవీ, ధూమపానం, మధుమేహం తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. 15 రోజులకుపైగా దగ్గు, ఛాతీలో నొప్పి, జ్వరం, బరువు తగ్గడం, ఆయాసము ఉన్నవారు కచ్చితంగా తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. 100 రోజుల పాటు క్షయవ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు సర్వే నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది అఖిల్, ప్రభులింగం, హైదర్‌అలీ, నవీన్‌గౌడ్, గోపాల్, రాజునాయక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న వీరేశంగౌడ్

దుద్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సమాజానికి అనుగుణంగా ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిచుకోవాలని రాష్ట్ర రీసోర్స్ పర్సన్ వీరేశంగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణలో శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తరగతి గదుల్లో నైపుణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని తెలిపారు. ఎంఈవో విజయరామారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థి మాదిరిగా ఉంటూ అనునిత్యం నూతన పోకడలతో విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్, ఎమ్మార్పీలు వెంకటయ్య, సంపత్, శంకరప్ప, ఆస్మా, సుల్తానా, అర్షియాబేగం, తేజస్విని పాల్గొన్నారు.

పరిగి: ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని రీసోర్స్‌పర్సన్ ఎండీ ఉస్మాన్‌అలీ సూచించారు. విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలను పెంపునకొరకు పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నంబర్ 1 పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయులకు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణ తరగతులకు హాజరై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తెలుగు, గణితం, ఇంగ్లీష్, పరిసరాల విజ్ఞానం, పాఠశాలల నిర్వహణ అంశాలపై తమ పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని చెప్పాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకవిద్యను అందించేదిశగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ వీణ, వెంకటప్రసాద్, నరేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, ప్రసాద్, స్వప్న, రమేశ్, రఘు పాల్గొన్నారు.

ఎక్స్ సర్వీస్‌మెన్‌కు సన్మానం



గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూడూరు, మే 23, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులంతా కలిసి ఎక్స్ సర్వీస్‌మెన్ గోవర్ధన్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ ఆఫీసర్ విశ్వేశ్వర్ మాట్లాడుతూ సిందూర్‌కు నాయకత్వం వహించిన కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిందని తెలిపారు. అనంతరం ఎక్స్ సర్వీస్‌మెన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 1999 ఆర్టీసీలో కార్గిల్ యుద్ధం జరిగే సమయంలో ఫైరింగ్ ఆర్డర్స్‌కు రెండు రోజుల సమయం తీసుకునే పరిస్థితులు ఉండేవన్నారు. ప్రస్తుతం క్షణాలపై ఫైరింగ్ ఆర్డర్స్ వస్తున్నాయని, ఆర్మీలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌పై ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ కమల్‌రెడ్డిపై కవితను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో రామ్‌మస్తానీ, ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్

వికారాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): మొక్కల సంరక్షణ బాధ్యత మహిళా సంఘాలదేనని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ అన్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అమృత్ మిత్ర కార్యక్రమంలో భాగంగా 'విమెన్ ఫర్ ట్రీస్' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవికుమార్, పట్టణ సమన్వయ అధికారి వెంకటేశ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు..

మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలి

మోమిన్‌పేట్: జూన్ మొదటివారం నాటికి మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని దుర్గం చెరువు గ్రామంలో పారిశుధ్య, నర్సరీ, గ్రామ పంచాయతీ రికార్డులను శుక్రవారం ఆమె పరిశీలించారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు, ఎక్సైజ్ సిబ్బంది

తాండూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిస కావొద్దని తాండూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ విస్తృత ప్రచారాన్ని చేపట్టింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో 'గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం - మన సమాజాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో అవగాహన సదస్సు, ర్యాలీలను నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ అమ్ముతున్నట్లు సమాచారం తెలిస్తే 8712658754 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని సీఐ ప్రజలను కోరారు. ఎక్సైజ్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి స్థలాల పరిశీలన



ముజాహిద్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కులకచర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముజాహిద్‌పూర్‌లో మంజూరైన ఇందిరమ్మ ఇంటి స్థలాలను అధికారులు శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను హౌసింగ్ ఏఈ హర్షవర్ధన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్ పరిశీలించారు. ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లు లేనివారిగా గుర్తించారు. త్వరలోనే ఇంటి నిర్మాణాలకు ముగ్గు వేస్తామని తెలిపారు.

రసాయన ఎరువులు తగ్గించాలి

పెద్దేముల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుధారాణి పంటల సాగుపై పలు విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, డాక్టర్ కె.పరిమళ, ఏవో పవన్‌ప్రీతమ్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాలికను గర్భవతి చేసిన వ్యక్తి అరెస్ట్



నిందితుడు శ్రీకాంత్

మేడ్చల్ టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): బాలికపై వరుసగా అత్యాచారం చేసి గర్భవతిని చేసిన వ్యక్తిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించి మేడ్చల్ సీఐ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. ఓ మహిళ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన శ్రీకాంత్ ముదిరాజ్(28)ను రెండో వివాహం చేసుకుంది. అప్పటికే ఆమెకు 13 ఏళ్ల కూతురు, ఇద్దరు కొడుకులు(బాలిక, తమ్ముళ్లు) ఉన్నారు. కాగా శ్రీకాంత్ తరుచూ ఆ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడు. తన వేధింపుల గురించి తల్లికి గాని, ఇతరులకు గాని చెప్పొద్దని బెదిరించేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో బాలికపై అత్యాచారం చేయడం మొదలుపెట్టాడు. ఇదేక్రమంలో గత ఆదివారం బాలిక కడుపులో నొప్పిగా ఉందంటూ తల్లికి చెప్పడంతో చికిత్స నిమిత్తం మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు బాలిక గర్భవతిగా నిర్ధారించారు. దీంతో బాలికను అడిగి తెలుసుకోగా శ్రీకాంత్ ముదిరాజ్ కొద్ది రోజులుగా అత్యాచారానికి పాల్పడుతున్నాడని తెలిపింది. దీంతో బాలిక తల్లి శుక్రవారం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా శ్రీకాంత్ ముదిరాజ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



లింగం మృతదేహం

మేడ్చల్ టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్న క్రమంలో ఓ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అత్వెల్లి సమీపంలోని ఓ ప్రైవేటు వెంచర్ క్వార్టర్స్‌లో విద్యుత్ సరఫరా సరిగా లేకపోవటంతో వెంచర్‌కు సంబంధించిన వ్యక్తులు స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ దుండిగళ్ల లింగం(50)ను పిలిచి వెంచర్‌లోని క్వార్టర్స్ విద్యుత్ లైన్ మరమ్మతు చేయాలని కోరారు. దీంతో విద్యుత్ లైన్లను పరిశీలించిన లింగం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని అత్వెల్లి ఆలయం వెనుక వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ లైన్లను సరి చేయడానికి వెళ్లి లైన్లు పరిశీలిస్తున్న క్రమంలో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ మార్చురీకి తరలించారు. కాగా అనధికారికంగా ప్రైవేట్ వ్యక్తిని పిలిచి ట్రాన్స్‌ఫార్మర్‌పై మరమ్మతులు చేసేందుకు ప్రేరేపించిన సదరు వెంచర్ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



హరివర్ధన్(ఫైల్)

కులకచర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన కులకచర్ల మండలంలో జరిగింది. మండలంలోని పుట్టపహడ్ గ్రామశివారులో పాలమూర్‌కు వెళ్లే మార్గంలో మంగళవారం రాత్రి ఆగి ఉన్న లారీని బైక్‌పై వెళ్తున్న హరివర్ధన్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడటంతో పాలమూర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

కారును ఢీకొన్న బొలెరో



ప్రమాదానికి గురైన కారు

చౌడాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కారును బొలెరో వాహనం ఢీకొట్టింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచి చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ ప్రయాణిస్తున్న కారును బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అశోక్‌కుమార్ కారు డ్యామేజ్ అయింది.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

కులకచర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల ఎస్‌బీఐ బ్యాంకు దగ్గర గత 2024 జూన్ 1న కులకచర్లకు చెందిన మహేశ్ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేశాడు. దీంతో నూతన పరిజ్ఞానం (సీఈఐఆర్)తో సెల్‌ఫోన్లను గుర్తించి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు



కులకచర్లలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

వికారాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఇంగ్లీష్ ఫస్టియర్ పరీక్షకు 1,175మంది విద్యార్థులకు 1,103మంది హాజరు కాగా, 72 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 128మంది విద్యార్థులకు 109 మంది హాజరు కాగా, 19 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

బషీరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): తూకాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని వికారాబాద్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి నిర్వాహకులకు అన్నారు. కాశీంపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో సమస్యలపై ఆమె అడిగి తెలుసుకున్నారు.

వీరజవాన్లకు నివాళి

తాండూరు, మే 23(ఆంధ్రజ్యోతి): రాథోడ్ యువసేన ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం అల్పాహారాన్ని వితరణ చేసి వీర జవాన్లను స్మరించుకున్నారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ల ఆత్మశాంతించాలని యువసేన వ్యవస్థాపకుడు రాథోడ్ అనిల్‌కుమార్ ఆకాంక్షించారు.